ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
రాజన్న సిరిసిల్ల జిల్లా వార్తలు
5★★★
శనివారం 6 జనవరి 2024



బలహీన వర్గాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం 8
8 ఉత్సాహంగా ఫ్రెండ్లీ క్రికెట్ టోర్నీ

చిగురిస్తున్న ఆశలు

- ఆరేళ్ల తర్వాత ఉపాధ్యాయ నియామకాలకు కసరత్తు
- మెగా డీఎస్సీకి సిద్ధమవుతున్న నిరుద్యోగులు
- ఖాళీల వివరాలు సేకరిస్తున్న ప్రభుత్వం
- జిల్లాలో 373 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ
- సర్దుబాటుతో కొనసాగుతున్న బోధన

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

మెగా డీఎస్సీపై నిరుద్యోగుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. విద్యాశాఖలో ఖాళీల భర్తీ, పదోన్నతులు చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. ఉపాధ్యాయ నియామకాల ఏర్పాట్లలో నిమగ్నం కావడంతో జిల్లాలో టెట్ అర్హత సాధించి ఉపా ధ్యాయ కొలువుల కోసం నిరీక్షిస్తున్న వారు మెగా డీఎస్సీ పై దృష్టి సారించారు. డీఎస్సీతోపాటు పదోన్నతుల ప్రక్రి య కూడా ఏకకాలంలో ప్రకటిస్తే ఖాళీలు మరిన్ని పెరిగే అవకాశం ఉంది. ఆరేళ్లుగా ఎదురు చూస్తున్న నిరుద్యోగులకు రాబోయే డీఎస్సీ ఊపిరి నింపినట్లు అవుతుందని భావిస్తున్నారు.

జిల్లాలో 10 వేల మందికి పైగా టెట్ అర్హులు

ఉపాధ్యాయ వృత్తినే లక్ష్యంగా బీఎడ్‌ను పూర్తి చేసి టెట్ అర్హత సాధించిన వారు రాజన్న సిరిసిల్ల జిల్లాలో 10 వేల మందికి పైగా ఉన్నారు. గత ప్రభుత్వం ఎన్నికలకు ముందు డీఎస్సీ నిర్వహిస్తామని ప్రకటించడంతో టెట్ అభ్యర్థులు సిద్ధమయ్యారు. అంతకుముందు టెట్ నిర్వహించినా డీఎస్సీ లేకుండానే ముగిసిపోయింది. కొత్త ప్రభుత్వం మెగా డీఎస్సీ నిర్వహిస్తామని ప్రకటించడంతో మళ్లీ నిరుద్యోగులు డీఎస్సీకి సిద్ధమవుతూ శిక్షణ కేంద్రాల వైపు పరుగులు తీస్తున్నారు.

2015లో ఉపాధ్యాయ నియామకాల కోసం టెట్ నిర్వహించారు. 2017లో ఉపాధ్యాయ నియామక పరీక్ష (టీఆర్‌టీ) నిర్వహించి ఉపాధ్యాయ నియామకాలు చేపట్టారు. ఆ తరువాత దాదాపు ఆరేళ్లకు పైగా ఉపాధ్యాయ నియామకాలకు సంబంధించి టెట్ కోసం ఎదురుచూస్తూ వచ్చారు. 2022లో టెట్ నిర్వహించగా 12,781 మంది హాజరయ్యారు. ఆ తరువాత 2023 సెప్టెంబరులో మరోసారి టెట్ నిర్వహించగా 6315 మంది అభ్యర్థులు హాజరయ్యారు. టెట్ స్కోరు సాధించిన వారు ఏడేళ్ల వరకు ఉపయోగించుకునే అవకాశం ఉంది.



పరీక్ష రాస్తున్న అభ్యర్థులు (ఫైల్)

జిల్లాలో ఖాళీ పోస్టులు

రాజన్న సిరిసిల్ల జిల్లాలో 534 పాఠశాలలు ఉండగా 52,450 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగవుతున్న సౌకర్యాలు, ఇంగ్లీష్‌మీడియం ప్రవేశపెట్టడంతో విద్యార్థుల సంఖ్యకూడా పెరుగుతూ వస్తోంది. అందుకు అనుగుణంగా ఖాళీల భర్తీ మాత్రం జరగడం లేదు. జిల్లాలో 2352 మంది ఉపాధ్యాయ పోస్టులు ఉండగా 1979 మంది పనిచేస్తున్నారు. 373 పోస్టులు ఖాళీలు ఉండగా బదిలీలు, పదోన్నతులతో 103 పోస్టులు ఖాళీ చేయడానికి గత ప్రభుత్వం నిర్ణయించింది. బదిలీల ప్రక్రియ నిలిచిపోయింది. ప్రస్తుతం దాదాపు 200 మంది టీచర్లను సర్దుబాటు పద్ధతిన కొనసాగిస్తున్నారు. రాష్ట్రంలోని రెండు మల్టీ జోన్‌లలో మొదటి మల్టీజోన్‌లో కాళేశ్వరం, బాసర, రాజన్న జోన్‌లు, రాజన్న జోన్‌లో కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట, కామారెడ్డి జిల్లాలు ఉన్నాయి. గత సంవత్సరం ఈ జోన్‌లలో ఉద్యోగ ఖాళీల్లో రాజన్న జోన్‌లో 2403 ఖాళీలు ఉండగా సిరిసిల్ల జిల్లాలో 601 పోస్టులు ఖాళీ ఉన్నట్లుగా వెల్లడించారు. బీఈడీ, డీఈడీ చేసిన వారు డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్నారు.

పుస్తకాలతో కుస్తీ

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) అర్హత సాధించిన వారు డీఎస్సీ రాసే వీలు ఉంది. జిల్లాలో అర్హత సాధించిన వారు షెడ్యూల్ వెలువడే అవకాశం ఉండడంతో మళ్లీ పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. జిల్లా కేంద్రంలోని లైబ్రరీలతోపాటు ప్రత్యేక గదులు ఏర్పాటు చేసుకొని పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు.

ముగ్గుల సంబరానికి రండి



- రేపు ఆంధ్రజ్యోతి - ఏబీఎన్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీ
- వేములవాడలో రాజశ్రీ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాట్లు
- ఉదయం 10 గంటల నుంచి పోటీ ప్రారంభం
- మహిళలందరికీ ఆహ్వానం
- చుక్కల ముగ్గులకే ప్రాధాన్యం
- విజేతలకు నగదు బహుమతులు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

తెలుగు సంస్కృతీసంప్రదాయాలకు సంక్రాంతి అద్దం పడుతుంది. పండగ సందర్భంగా ఆంధ్రజ్యోతి - ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరాబ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీ, పవర్‌డ్ బై ఎయిమ్స్ విద్యా సంస్థలు, రియల్ పార్ట్‌నర్స్ స్వర్గసీమ సుకేతన, స్థానిక స్పాన్సర్స్‌గా వేములవాడలోని హోంటౌన్ ఫ్యామిలీ రెస్టారెంట్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు వేములవాడలోని మల్లారం రోడ్ లోని రాజశ్రీ ఫంక్షన్‌హాల్‌లో వేదిక కానుంది. తొలి ముగ్గురు విజేతలకు నగదు బహుమతులను అందించనున్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ, కన్సోలేషన్ కింద విజేతలను ఎంపిక చేయనున్నారు.

ప్రథమ బహుమతిగా రూ.6 వేలు, రెండో బహుమతిగా రూ.4 వేలు, మూడో బహుమతిగా రూ.3 వేలు అందజేయనున్నారు. పోటీలో వయోభేదం లేకుండా మహిళలందరూ పాల్గొనవచ్చని నిర్వాహకులు తెలిపారు. ఇతర వివరాలకు 7013840728, 8074511657 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

పోటీ నిబంధనలు

- మహిళలు మాత్రమే పాల్గొనాలి. చుక్కల ముగ్గులు మాత్రమే వేయాలి. చేతితో మాత్రమే వేయాలి పరికరాలు ఉపయోగిస్తే మార్కులు కట్ చేస్తారు. జల్లెడ మాత్రం అనుమతిస్తారు.
- ముగ్గుకు కావాల్సిసిన రంగులు, పువ్వులు ఇతర సామగ్రి పోటీలో పాల్గొనే వారే వెంట తెచ్చుకోవాలి.
- ముగ్గు ఎన్ని చుక్కలు, ఎన్ని వరుసలు చెప్పగలిగి ఉండాలి.
- ముగ్గు వేయడానికి రెండు గంటల గరిష్ఠ సమయం.
- ముగ్గులలో గొబ్బెమ్మలు, బతుకమ్మ వంటివి అమర్చవచ్చు. ఇతర వస్తువులు ఎక్కువగా అమర్చకూడదు.
- ముగ్గుకు అదనపు అందం ఇవ్వడానికి వస్తువులను వాడాలి తప్ప అవే ప్రధాన అంశాలు కాకూడదు.

నైతికంగా తప్పుకోవాలి

సిరిసిల్ల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో నామినేటెడ్ పదవులు పొంది కొనసాగుతున్న వారు నైతికంగా తప్పుకోవాలని టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి చీటి ఉమేష్‌రావు ఒక ప్రకటనలో సూచించారు. ప్రభుత్వం తొలగించే వరకు చూడకుండా గౌరవప్రదంగా తప్పుకోవాలని పేర్కొన్నారు. 54 మంది వివిధ కార్పొరేషన్ చైర్మన్లను, గ్రంథాలయ సంస్థ చైర్మన్లను తాజాగా ప్రభుత్వం తొలగించిందని, మిగిలిన వారు కూడా తప్పుకోవాలని కోరారు.

లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో హోమం



హోమం నిర్వహిస్తున్న దంపతులు

తంగళ్లపల్లి, జనవరి 5: తంగళ్లపల్లి మండల కేంద్రంలో నిర్వహిస్తున్న విగ్రహ ప్రతిష్ఠాపనలో భాగంగా శుక్రవారం వేద పండితుల ఆధ్వర్యంలో హోమం, ఫలపుష్ప కార్యక్రమాలు నిర్వహించారు. నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, బీజేపీ నాయకులు రెడ్డబోయిన గోపి, ఎంపీపీ పడిగెల మానస రాజు, స్థానిక సర్పంచ్ అంకారపు అనిత రవీందర్, ఎంపీటీసీ కోడి అంతయ్య, నిర్వహాక కమిటి సభ్యులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ భవనం ప్రారంభం



ప్రారంభిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ అరుణారాఘవరెడ్డి

కోనరావుపేట, జనవరి 5 : కోనరావుపేట మండలం కొండాపూర్ గ్రామంలో నూతన గ్రామపంచాయతీ భవనాన్ని జడ్పీ చైర్ పర్సన్ అరుణ రాఘవరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో తండాలను గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేసిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చంద్రయ్య గౌడ్, ఫ్యాక్స్ చైర్మన్ బండ నర్సయ్య, టీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మల్యాల దేవయ్య ఎంపిటిసి పల్లె మంజుల రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ చేసిన డీఈవో

వేములవాడ టౌన్, జనవరి 5 : వేములవాడ పట్టణంలోని ప్రాథమిక పాఠశాలను జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రగతికి సంబంధించిన తొలిమెట్టు అమలు తీరు, ఉపాధ్యాయుల పాఠ్యప్రణాళిక, బోధనా సరళిని పరిశీలించారు. ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో వేములవాడ భవిత కేంద్రం నుంచి గెలుపొందిన ఐదుగురు విద్యార్థులను నిర్వహకురాలు జయలక్ష్మిని అభినందించారు. ఎంఈవో బన్నాజీ తదితరులు ఉన్నారు.

బాధ్యతలు స్వీకరించిన సెస్ ఏఈ

వీర్నపల్లి, జనవరి 5 : వీర్నపల్లి మండల సెస్ ఏఈగా ఎల్.స్రవంతి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. మారుమూల వీర్నపల్లి మండలం నూతన మండలంగా ఏర్పడి సెస్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడంతో స్రవంతిని ఏఈగా నియమించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు విద్యుత్ సమస్య తలెత్తకుండా కృషి చేస్తామన్నారు. ప్రజలకు, రైతులకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటామన్నారు. బాధ్యతలు స్వీకరించిన సెస్ ఏఈకి ఎంపీపీ మాలోతు భూల, సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం, అడవి పదిర సర్పంచ్ ఎడ్ల సాగర్, సెస్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

16 నుంచి వాలీబాల్ టోర్నీ

చందుర్తి, జనవరి 5 : చందుర్తి మండలం మల్యాలలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఆహ్వానిత వాలీబాల్ కేసీఆర్ కప్ టోర్నమెంట్‌ను ఈ నెల 16 నుంచి 17 వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు ఈర్లపల్లి రాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మల్యాల వాలీబాల్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. పూర్తి వివరాల 7731928884, 7095353096, 8688493277 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి జన్మదిన వేడుకలు

వేములవాడ రూరల్, జనవరి 5: మాజీ మంత్రి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. వట్టెంలలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కేక్ కట్ చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వకులాభరణం శ్రీనివాస్, మాజీ ఎంపీపీ వట్టెంల ఎంపీటీసీ రంగు వెంకటేశం, ఎదురుగట్ల సర్పంచ్ సోయినేని కరుణాకర్, నాయకులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో అభయ హస్తం దరఖాస్తుల నమోదు

సిరిసిల్ల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన ద్వారా స్వీకరించిన దరఖాస్తులన్నింటినీ ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నట్లు అదనపు కలెక్టర్ పూజారి గౌతమి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ప్రజాపాలన, అభయ హస్తం దరఖాస్తుల డేటా ఎంట్రీ కోసం నియమించిన ఆపరేటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌతమి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీల కోసం తీసుకున్న ప్రతీ ఒక్క దరఖాస్తును ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. దరఖాస్తును తప్పులు లేకుండా నమోదు చేయాల్సిన బాధ్యత డేటా ఎంట్రీ ఆపరేటర్లపై ఉందన్నారు. ఇందుకోసం అవసరమైన కంప్యూటర్లు, ఇతర సౌకర్యాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆపరేటర్లకు సహాయకులను నియమిస్తామన్నారు. ముఖ్యంగా గ్రామ పంచాయతీ కార్యదర్శి లేదా కౌంటర్ల ఇన్‌చార్జీలు ఎవరో ఒకరు డేటాను నమోదు చేసేందుకు సహకరిస్తారన్నారు. ఆపరేట్లపైనే ఎక్కువ బాధ్యత ఉంటుందన్నారు. జిల్లాలో స్వీకరించిన దరఖాస్తులన్నింటినీ ఆన్‌లైన్ చేసేందుకు బృందాలు ఏర్పాటు చేశామన్నారు. ఒక్కో బృందానికి లాగిన్ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఒక్కో డేటా ఎంట్రీ ఆపరేటర్ కనీసం ఐదు దరఖాస్తులను ముందుగా ఎంటర్ చేయాలన్నారు. దీంతో ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరించుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. దరఖాస్తు ఫారాలు బయటకు వెళ్లవద్దన్నారు. సమావేశంలో ఆర్డీవోలు ఆనంద్ కుమార్, మధుసూధన్, డీపీవో రవీందర్ పాల్గొన్నారు.





మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గౌతమి, హాజరైన అధికారులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు

జలశక్తి అభియాన్ కేంద్ర బృందం పరిశీలన



నాగంపేటను సందర్శించిన సభ్యులు

ఎల్లారెడ్డిపేట, జనవరి 5: ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్, దుమాల గ్రామాల్లో జలశక్తి అభియాన్ కేంద్ర బృందం ప్రతినిధులు గణేశ్‌కుమార్ బరన్వాల్, లక్ష్మీనారాయణ దామోదర ఆధ్వర్యంలోని సభ్యులు శుక్రవారం పర్యటించారు. వెంకటాపూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి జలశక్తి అభియాన్ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం గ్రామ శివారులోని అర్బన్ పార్కు, దుమాలలోని ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన పనులను పరిశీలించారు. భూగర్భ జలా ల పెంపునకు చేపట్టిన పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతీ నీటి బొట్టును ఒడిసి పట్టేలా పనులను చేపట్టాలని సూచించారు. సర్పంచులు అంజమ్మ, రజిత, డీఆర్డీవో శ్రీనివాస్, ఏపీడీ నర్సింహులు, ఎంపీడీవో చిరంజీవి, ఎంపీటీసీ తిరుపతిబాబు, ఏపీవో కొమురయ్య పాల్గొన్నారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మండలం సముద్రలింగాపూర్, నర్మాల, నాగంపేట, కొత్తపల్లి గ్రామాల్లో జలశక్తి కేంద్ర బృందం సభ్యులు శుక్రవారం సందర్శించారు. జలశక్తి కేంద్ర బృందం సభ్యులు గణేష్‌కుమార్ బరణ్వాల్, డైరెక్టర్, టెక్నికల్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ దామోదర్, ఉపాధి హామీ పనులను పరిశీలించారు. భూగర్భ జలాల పెంపునకు చేపట్టిన పనులు, మొక్కల పెంపకంతో పాటు ఇతర ఉపాధి హామీ పనులు పరిశీలించారు. అడిషనల్ డీఆర్‌డీవో మదన్ మోహన్, అసిస్టెంట్ ఏపీడీ రవీందర్, ఎంపీడీవో శ్రీనివాస్, ఏపీవో అరుణ, ఏపీఎం సుదర్శన్, సర్పంచ్‌లు ఎడబోయిన రాజు, దోమకొండ లక్ష్మి, అక్కపల్లి సరళ, రాజిరెడ్డి, ఎంపీటీసీలు పర్శరాములు, గొర్రె బాలమణి తదితరులు ఉన్నారు.

ఆరు గ్యారెంటీల దరఖాస్తుకు

నేడు చివరి రోజు

- ఏడో రోజు 12,458 దరఖాస్తులు

సిరిసిల్ల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రజాపాలన కార్యక్రమం శనివారం ముగియనుంది. గత నెల 28 నుంచి దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం చేపట్టారు. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా అభయ హస్తం, ఆరు గ్యారెంటీలకు సంబంధించి ప్రజలనుంచి దరఖాస్తులు స్వీకరించడానికి కౌంటర్లతో పాటు సౌకర్యాలు కూడా కల్పించారు. శుక్రవారం ఏడో రోజు 23 గ్రామ పంచాయతీలు, నాలుగు మున్సిపల్ వార్డుల్లో జరిగిన ప్రజాపాలనలో 12458 అభయ హస్తం దరఖాస్తులు వచ్చాయి. జిల్లాలో ఇప్పటి వరకు ఆరు గ్యారెంటీలకు సంబంధించి 1,50, 808 దరఖాస్తులు, ఇతర దరఖాస్తులు 20614 వచ్చాయి. చివరిరోజు శనివారం 11 గ్రామాల్లో ప్రజాపాలన సభలు నిర్వహించనున్నారు. చందుర్తి మండలంలో బండపల్లి, ఇల్లంతకుంట మండలం రేపాక, సోమారంపేట, అనంతగిరి, గొల్లపల్లి, గంభీరావుపేట మండలం రాజుపేట, ముస్తాబాద్ మండలం సేవాలాల్ తండా, తంగళ్లపల్లి మండలం తంగళ్లపల్లి, వేణుగోపాల్‌పూర్, వేములవాడ మండలం గుర్రంవానిపల్లె, వేములవాడ రూరల్ మండలం నమిలిగుండుపల్లిలో ప్రజాసదస్సు కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను రద్దు చేయాలి

చందుర్తి, జనవరి 5: ప్రతినెలా స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను రద్దు చేయాలని చందుర్తి, రుద్రంగి మండలాల ఉపాధ్యాయులు డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్‌ను కోరారు. మూడపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఉపాధ్యాయ సంఘ నేతలు మాట్లాడారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించడంతో విద్యార్థులకు బోధించే పని దినాలు తగ్గుతున్నాయని తల్లిదండ్రుల అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారన్నారు. సమావేశాలను రద్దు చేయాలని స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు మల్లేశంకు వినతి పత్రం అందజేశారు.

తోటకు విద్యుత్ కంచె
- విద్యుదాఘాతంతో యువకుడికి తీవ్ర గాయాలు


గాయపడ్డ యువకుడు

చందుర్తి, జనవరి 5: అటవీ జంతువుల నుంచి కూరగాయల తోటను కాపాడుకునేందుకు తోట చుట్టూ కంచెను ఏర్పాటు చేయగా, విద్యుత్ కంచెను గమనించని పక్క చేను రైతు విద్యుదాఘాతానికి గురై తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చందుర్తి మండలం రామన్నపేట గ్రామానికి చెందిన నవీన్ రెడ్డి అనే యువకుడు గత నెల తన పక్క కూరగాయల తోటలోకి వెళ్లగా విద్యుదాఘాతానికి గురై స్పృహ తప్పి పడిపోయాడు. అక్కడే ఉన్న అతడి భార్య కూడా విద్యుదాఘాతం నుంచి తప్పించుకొని సమీపంలో ఉన్న రైతుకు సమాచారం ఇచ్చింది. ట్రాన్స్‌ఫార్మర్‌ను బంద్ చేసి గాయపడిన రైతును 108 అంబులెన్స్‌లో వేములవాడలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. కాగా గ్రామంలో కొందరు వేటగాళ్లు కూడా విద్యుత్ షాక్‌తో వన్యప్రాణులను వేటాడి విక్రయిస్తున్నట్లు గ్రామస్థులు పేర్కొంటు న్నారు. విద్యుత్ కంచెలు ఏర్పాటు చేసే వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఉరివేసుకుని యువకుడి ఆత్మహత్య

కరీంనగర్ క్రైం, జనవరి 5: నగరంలోని కట్టరాంపూర్ ప్రాంతానికి చెందిన బండమీది రాజ్‌కుమార్ (38) అనే యువకుడు శుక్రవారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజ్‌కుమార్ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటాడు. ఇంట్లోనే రాత్రి 8 గంటల ప్రాంతంలో ఉరివేసుకోగా అతని భార్య గమనించి స్థానికుల సహాయంతో ఆసుపత్రికి తరలించేసరికి మృతి చెందాడు. ఆత్మహత్యకు కారణాలు ఇంకా తెలియరాలేదు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

హత్యాయత్నం కేసులో ఒకరి అరెస్టు

కరీంనగర్ క్రైం, జనవరి 5: కొత్తపల్లి మండల కేంద్రంలో గురువారం సాయంత్రం యువతి కావ్యశ్రీపై కత్తితో దాడి చేసి హత్యకు ప్రయత్నించిన కేసులో నిందితుడు బొద్దుల సాయిని అరెస్టు చేశామని కరీంనగర్ రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్ తెలిపారు. మూడేళ్ల నుంచి ప్రేమిస్తున్నప్పటికీ తనను పెళ్లి చేసుకునేందుకు నిరాకరించడంతో ఆమెను హత్య చేసేందుకు వెళ్లి ఆమె గొంతుపై కత్తితో గాయపరిచానని నిందితుడు ఒప్పుకున్న ట్లు సీఐ తెలిపారు. కొత్తపల్లిలోని తన ఇంటి వద్దనే నిందితుడు సాయిని అరెస్టు చేసి, దాడికి ఉపయోగించిన కత్తిని సీజ్ చేశామని తెలిపారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ వివరించారు.

ఒకరి అరెస్టు

సిరిసిల్ల క్రైం, జనవరి 5: భార్యపై హత్యాయత్నం కేసులో భర్తను అరెస్ట్ చేసినట్లు టౌన్ సీఐ ఉపేందర్ తెలిపారు. సిద్దిపేట జిల్లా చిన్న కోడూరు మండలం విట్టల్‌నగర్‌కు చెందిన బోయిన శ్రీకాంత్‌తో సిరిసిల్ల పట్టణం పెద్దూరుకు చెందిన సౌజన్యను అన్ని లాంచ నాలు ఇచ్చి వివాహం చేశారు. ఆ తర్వాత సౌజన్యకు వేధింపులు పెరిగాయి. అదనంగా రూ.5 లక్షలు కట్నం తేవాలని బెదిరించి కిరోసిన్ పోసి హత్యకు యత్నించాడు. బాధితురాలి ఫిర్యాదుతో భర్త శ్రీకాంత్‌ను అరెస్టు చేశామని సీఐ తెలిపారు.

దాడి ఘటనలో ముగ్గురిపై కేసు

సిరిసిల్ల క్రైం, జనవరి 5: సిరిసిల్ల పట్టణంలోని చంద్రంపేటలో రవి అనే వ్యక్తిపై దాడిచేశారు. ద్విచక్రవాహనంపై వెళ్తున్న రవిపై బైపాస్ మూలమలుపు వద్ద ముగ్గురు వ్యక్తులు పల్సర్ బైక్‌పై వచ్చి అకస్మాత్తుగా కర్రలతో దాడి చేశారు. అంతటితో ఆగకుండా కిందపడేసి కొట్టారు. ఈసంఘటనపై ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఉపేందర్ తెలిపారు.

ఆరు గ్యారెంటీలు పక్కాగా అమలు చేస్తాం

- హుస్నాబాద్ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం
- ఓటు వేసి గెలిపించిన ప్రజలకు ధన్యవాదాలు
- ముఖ్య కార్యకర్తల సమావేశంలో పొన్నం ప్రభాకర్



మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సన్మానిస్తున్న నాయకులు

సైదాపూర్, జనవరి 5: ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన ఆరు గ్యారెంటీలను పక్కాగా అమలు చేస్తామని, ఇందులో ఎలాంటి అనుమానం లేదని రవాణ శాఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం సైదాపూర్ మండల కేంద్రంలో ఓ ఫంక్షన్‌హాల్‌లో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దొంత సుధాకర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన మండల ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే గెలిచి, మంత్రిగా బాధ్యతలు స్వీకరించి మొదటి సారిగా మండలానికి వచ్చిన మంత్రిని కార్యకర్తలు సన్మానించారు. తహసీల్దార్ దూలం మంజూల, ఎంపీడీవో పద్మావతి, ఎంపీవో సురేందర్, ఏపీఎం కుమారస్వామి, వివిద శాల అధికారులు మంత్రిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛ అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ ప్రజలకు మంత్రులను, ఎమ్మెల్యేలను, అధికారులను కలువడానికి ఎలాంటి ఆంక్షలు లేవన్నారు. ఇది ప్రజా పాలన అని ప్రజలు ఎప్పుడైన తమను కలువవచ్చన్నారు. ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకవస్తే పరిష్కరిస్తానన్నారు. హుస్నాబాద్ నియోజక వర్గానికి దేవాదుల, శ్రీరాంసాగర్, మిడ్ మానేరు నీరు పూర్తి స్థాయిలో తీసుక వచ్చి నియోజక వర్గాన్ని సస్యశ్యామలం చేస్తామన్నారు. పనులు నడులు కూడా ప్రారంభించామన్నారు. హుస్నాబాద్ కార్యాలయం ఎల్లవేళలా తెరచి ఉంటుందని, తాను లేక పోయినా అక్కడ ఉన్నవారు అర్జీలు తీసుకుంటారన్నారు. మాట ప్రకారం మహిళలకు ఉచిత బస్సు, ఆరోగ్య శ్రీ అమలు చేశాం. ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వల్ల తమకు ఆదాయం రావడం లేదని బీఆర్ఎస్ నాయకులు ఆటో డ్రైవర్లను రెచ్చగొడుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్‌కు మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం ఇష్టం ఉందో, లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు ఆరున్నర కోట్ల జీరో టికెట్లు అమ్ముడు పోయాయని వివరించారు. రవాణాశాఖ మంత్రిగా చొరవతీసుకొని ఆర్థిక శాఖ మంత్రితో మాట్లాడి ఆర్టీసీకి నష్టం వాటిల్లకుండా ఎప్పటికప్పుడు సంస్థంకు డబ్బులు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పెండింగులో ఉన్న విద్యుత్ బకాయిలు సైతం చెల్లించామని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గుండారపు శ్రీనివాస్, రాఘవులు, పల్లేని రవీందర్‌రావు, మ్యాకల రవీందర్, మిట్టపెళ్లి కిష్టయ్య, ఎంపీటీసీలు చాడ చైతన్య-కొండాల్‌రెడ్డి, సర్పంచ్ తడిసిన వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కామిని వీరేశం, కాంగ్రెస్ నాయకులు భిక్షపతి నాయక్, పంతంగి రవీందర్, అనగోని శ్రీనివాస్ గుడిసె భాష్కర్, గుడిసె ఎల్లయ్య, తాళ్లపెల్లి రవి, కంకణాల చంద్రారెడ్డి, గుంటి సమ్మయ్య సీపీఐ మండల కార్యదర్శి గొంగళ్ల సదానందం, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బత్తుల బాబు, మాజీ ఎంపీటీసీ ఒజ్జె కొమురయ్య, సీపీఐ నాయకులు వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

దళితులను మోసం చేసిన ఘనుడు కేసీఆర్


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

కోరుట్ల, జనవరి 5 : అధికారం కోసం దళితులకు మూడు ఎకరాలు, దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానని నమ్మించి మోసం చేసిన ఘనుడు మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం కోరుట్ల పట్టణంలోని జువ్వాడి భవనంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావుతో కలిసి విలేకర్ల సమావేశంలో జీవన్‌రెడ్డి మాట్లాడారు. చీటింగ్‌కు పేటెంట్ రైట్ కేసీఆర్‌కు దక్కుతుందని, నంబర్ వన్ 420 కేసీఆర్‌అని దుయ్యబట్టారు. మైనార్టీల సంక్షేమాన్ని గాలికి వదిలేసింది బీఆర్ఎస్ ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీల ద్వార అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోంన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు అందజేస్తామని, బీడీ కార్మికులందరికి పెన్షన్ అందుతుందని అ న్నారు. ముత్యంపేట చెక్కర కర్మాగారం త్వరలోనే తెరిపంచేలా రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి సరైన నిర్ణయం తీసుకుంటారన్నారు. సాగునీటి రంగంలో ప్రగతి ఉమ్మడి రాష్ట్రంలోనే జరిగిందని బీఆర్ఎస్ ప్రభుత్వం సాగునీటి రం గంలో అభివృద్ధి చేసింది శూన్యమన్నారు. నిర్మల్ జిల్లాలోని సదర్ మట్ బ్యా రేజీ నిర్మాణానికి నిధులు మంజూరుకు కృషి చేస్తామన్నారు. కోరుట్ల నియోజకవర్గంలో మాజీ మంత్రి రత్నాకర్‌రావు చేసిన అభివృద్ధే తప్ప విద్యాసాగర్ రావు చేసింది శూణ్యమన్నారు. కోరుట్ల ఎమ్మెల్యేగా ఉండి విద్యాసాగర్ రావు కేవలం పట్టణాలతో పాటు పలు గ్రామాలలో రోడ్లపై డివైడర్ల నిర్మాణం మాత్రమే చేసాడని ఎద్దేవా చేసారు. కాంగ్రెస్ ప్రభు త్వం ప్రజాపాలన గ్యారెంటీల అమలుకు కట్టుబడి ఉందని, కేవలం ప్రభు త్వం ఏర్పడిన 48 గంటల్లో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు నాయకులు మచ్చ కవిత, కొంత రాజం, తిరుమల గంగాధర్, నేమూరి భూమయ్య, నహీం పాల్గొన్నారు.

దళితబంధు పథకాన్ని కొనసాగించాలి


ఆందోళన చేస్తున్న దళితబంధు లబ్ధిదారులు

పెద్దపల్లి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాం చేపట్టిన దళిత బంధు పథకాన్ని కొనసాగిస్తూ తమకు మంజూరు చేసిన యూనిట్లను గ్రౌండింగ్ చేసేందుకు బడ్జెట్ విడుదల చేయాలని లబ్ధిదారులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు మంథని, కమాన్‌పూర్, రామగిరి, ముత్తారం మండలం చెందిన దళిత బంధు లబ్ధిదారులు శుక్రవారం కలెక్టర్ కార్యాలయానికి తరలివచ్చి ఆందోళన నిర్వహించారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ అరుణశ్రీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలకు ముందు గత ప్రభుత్వ హయాంలో దళితబంధు పథకం కింద తమను ఎంపిక చేశారు. ఎన్నికల నోటిఫికేషన్ రావడం వల్ల కోడ్ అమల్లోకి వచ్చిందన్నారు. ఎన్నికలు పూర్తయి పాత ప్రభుత్వం మారి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. దళిత బంధు పథకాన్ని కొనసాగిస్తూ, ఇప్పటి వరకు తమకు మంజూరైన యూనిట్లను గ్రౌండింగ్ చేసేందుకు నిధులు విడుదల చేయాలని నూతన ప్ర భుత్వాన్ని కోరారు. తమ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కూడా తమ బాధను అర్థం చేసుకుని ప్రభు త్వంపై ఒత్తిడి తీసుక వచ్చి నిధులు మంజూరు చేయించాలని కోరారు.

డిగ్రీ పరీక్షల్లో ఇద్దరు డీబార్

గణేశ్‌నగర్, జనవరి 5: శాతవాహన విశ్వవిద్యాలయ పరిధిలో జరుగుతున్న డిగ్రీ 1, 3వ సెమిస్టర్ పరీక్షల్లో ఇద్దరు విద్యార్థులు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడగా వారిని డీబార్ చేసినట్లు శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్ వి శ్రీరంగ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల పెద్దపల్లిలో ఒకరు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల హుస్నాబాద్‌లో ఒకరు డీబార్ అయినట్లు తెలిపారు.

డీఈఎల్ఈడీ పరీక్షల్లో ఒకరు..

తిమ్మాపూర్, జనవరి 5: మండలంలోని ఎల్ఎండీ కాలనీలో గల (ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణా సంస్థ)డైట్‌లో నిర్వహిస్తున్న డీఈఎల్ఈడీ పరీక్షల్లో ఒకరు డీబార్ అయినట్లు పరీక్షల చీఫ్ సూపరిండెంట్ డైట్ ప్రిన్సిపాల్ శ్రీరాం మొండయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 4 నుండి డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఈఎల్ఈడీ) మొదటి సంవత్సర పరీక్షలు ప్రారంభమయ్యాయి. డైట్‌లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాల విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. కాగా రెండో రోజు శుక్రవారం సమాజం, విద్య, పాఠ్యప్రణాళిక పరీక్షలో ఒకరు కాపీకి పాల్పడుతుండడంతో డీబార్ చేశారు.

జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఇద్దరి ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 5: హరియాణ రాష్ట్రంలో ఈ నెల 8వ తేదీ వరకు నిర్వహించే జాతీయస్థాయి ఎస్‌జీఎఫ్ హ్యాండ్‌బాల్ పోటీలకు ఉమ్మడి జిల్లాకు చెందిన ఇద్దరు ఎంపికయ్యారు. రామడుగుకు చెందిన సమంతుల మధు రోహిత్, నీలం సాయి కార్తీక్ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్రస్థాయి అండర్-19 ఎస్‌జీఎఫ్ హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రతిభచాటినజాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని కరీంనగర్ జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పి శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా వీరిని ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బసరవేని లక్ష్మణ్, జాయింట్ సెక్రటరీ నమిలకొండ ప్రభాకర్ అభినందించారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

హుజూరాబాద్‌రూరల్, జనవరి 4: మండలంలోని రాంపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న భరత్ అనే విద్యార్థి ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ఇన్‌చార్జీ హెచ్ఎం సురేందర్, వ్యాయామ ఉపాధ్యాయుడు వేముల రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కామారెడ్డి జిల్లాలో నిర్వహించే జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో విద్యార్థి పాల్గొనన్నుట్లు తెలిపారు.

బురదలో జారిపడి ఒకరి మృతి


కుమారస్వామి(ఫైల్)

హుజూరాబాద్‌రూరల్, జనవరి 4: మండలంలోని కాట్రపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి శుక్రవారం వ్యవసాయ క్షేత్రంలోని బురదలో కాలుజారిపడి మృతి చెందాడు. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పిట్టల కుమారస్వామి(40) అనే వ్యక్తి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మూ డేళ్ల క్రితమే భార్య చనిపోయింది. వీరికి కుమారుడు(10) ఉన్నాడు. భార్య చనిపోయిందన్న దిగులుతో పిట్టల కుమారస్వామి మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 4న ఇంటి నుంచి బయటికి వెళ్లాడు. కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం గాలించారు. శుక్రవారం పిట్టల భాగ్యమ్మ అనే మహిళ పొలం పనులు చేసేం దుకు వెళ్లగా బురదలో పడి ఉన్న కుమారస్వామిని చూసి స్థానికులకు తెలియ జేసింది. స్థానికులు వెంటనే హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీ క్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లా ఆసుపత్రిని సందర్శించిన కేంద్ర బృందం

సుభాష్‌నగర్ జనవరి 5: జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిని టీబీ ముక్త్ భారత్ కేంద్ర బృందం శుక్రవారం సందర్శించింది. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని క్యాజువాలిటీ, ఓపీ వార్డులు, ఐపీ వార్డులు, ల్యాబులు, పేషంట్ వార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా బృందం ప్రతినిధి డాక్టర్ ప్రమోద్‌రెడ్డి వైద్యులు, సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పేషంట్లకు అందించాల్సిన సేవలను గురించి వారికి వివరించారు. అంతేకాకుండా వెంటిలేషన్ ఎలా ఉండాలి, పేషంట్లకు కనీస సౌకర్యాలు, విధిగా మాస్కులు ధరించడం వంటి సూచనలను చేశారు. అలాగే ఆసుపత్రిలో చేయాల్సిన మార్పులు చేర్పులపై సలహాలు సూచనలు అందించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మంథని, జనవరి 5 : మంథని మున్సిపల్ పరిధిలోని కూచిరాజుపల్లిలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదలో ఇద్దరు గాయపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం.. కొడారి శంకర్ అనే వ్యక్తి టీఎస్ 25 ఈ 2941 నంబరు గల కారులో యైటింక్లయిన్ కాలనీ నుంచి భూపాలపల్లి వైపు వెళుతుండగా కూలిరాజుపల్లి వద్ద టైరు పేలిపోయింది. దీంతో కారు అదుపుతప్పి అక్కడే ఉన్న గొర్రెల మందను, కాపరి చెల్కల తిరుపతి, మంథని నుంచి ద్విచక్రవాహనంపై వెళుతున్న పోయిల భూమరాజు అనే వ్యక్తిని ఢీకొట్టింది. గాయపడిన తిరుపతి, భూమరాజులను మంథని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు పెద్దపల్లికి తరలించారు. ఎస్సై కిరణ్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పీపుల్స్‌పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా తిరుపతి


తిరుపతి

సుభాష్‌నగర్, జనవరి 5: పీపుల్స్ పార్టీ ఆఫ్ ఇండియా (డెమొక్రటిక్) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జిగా గంగారపు తిరుపతిని నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు పొతునూరి సత్యనారాయణ శుక్రవారుం ఉత్తర్వులు జారీ చేశారు. తన నియమకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

గ్రూప్స్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

గణేశ్‌నగర్, జనవరి 5: బీసీ స్టడీ సర్కిల్లో గ్రూప్స్ శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ కరీంనగర్ జిల్లా డైరెక్టర్ డాక్టర్ ఎం రవికుమార్ తెలిపారు. ఉమ్మడి కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాలోని నిరుద్యోగులు ఈ నెల 8 నుంచి 20 వరకు ఆన్‌లైన్‌లో bcstudycircle.cgg.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. డిగ్రీ ఉత్తీర్ణులు కులం, ఆదాయం, ఆధార్ కార్డు, పాస్ ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

బస్సును ఢీకొట్టిన కారు

హుజూరాబాద్‌రూరల్, జనవరి 4: మండలంలోని సింగాపూర్ గ్రామ శివారులోని ఎరుకులగూడెం క్రాస్‌రోడ్డు వద్ద శుక్రవారం ఆర్టీసీ బస్సును ఓ కారు అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. వరంగల్-1 డీపోకు చెందిన ఆర్టీసీ బస్సు వరంగల్ నుంచి నిజామాబాద్ వైపు వెళ్తున్న క్రమంలో సింగాపూర్ గ్రామ శివారులోని ఎరుకులగూడెం క్రాస్ వద్దకు చేరుకోగానే కరీంనగర్ వైపు నుంచి అతివేగంగా వస్తున్న ఓ కారు అతివేగంగా వచ్చి బస్సు ముందు భాగాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పాక్షికంగా ధ్వంసమైంది. ఆర్టీసీ డ్రైవర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ మృతి

కాల్వశ్రీరాంపూర్, జనవరి 5: పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ ఒకరు మృతిచెందిన సంఘటన మండలంలోని మొట్లపల్లిలో చోటు చేసుకుంది. మృతుని కుటుంబ సభ్యులు చెప్పిన వివరాల ప్రకారం.. సంఘాని రాజయ్య(52) కొన్ని రోజులుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఎన్ని ఆసుపత్రులు తిరిగినా నొప్పి తగ్గకపోవడంతో గురువారం తన ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు కరీంనగర్‌కు తరలించగా ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

'ప్రజాపాలన' పరిశీలన


మాట్లాడుతున్న నోడల్ అధికారి

వేములవాడ టౌన్, జనవరి 5: వేములవాడ మండలం రుద్రవరంలో నిర్వహిస్తున్న ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని ఉమ్మడి జిల్లా ప్రజాపాలన నోడల్ అధికారిశ్రీదేవసేన కలెక్టర్ అనురాగ్ జయంతితో కలిసి శుక్రవారం పరిశీలించారు.దరఖాస్తుల డేటా ఎంట్రీపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. డేటా ఎంట్రీకి పక్కాగా ఏర్పాట్లు చేయాలన్నారు. అడిషనల్ కలెక్టర్ పూజారి గౌతమి, సర్పంచ్ రాంరెడ్డి, ఎంపీటీసీ గాలిపెల్లి సువర్ణస్వామి

రాజన్న సేవలో

జలశక్తి అభియాన్ సెంట్రల్ నోడల్ అధికారి


ప్రసాదం అందజేస్తున్న సూపరింటెండెంట్

వేములవాడ, జనవరి 5 : వేములవాడ రాజరాజేశ్వర స్వామివారిని జలశక్తి అభియాన్ సెంట్రల్ నోడల్ అధికారి గణేష్ కుమార్ భరణ్వాల్ శుక్రవారం దర్శించుకున్నారు. స్వామివారి ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. అనంతరం నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వచనం ఇవ్వగా, ప్రొటోకాల్ పర్యవేక్షకుడు సిరిగిరి శ్రీరాములు ప్రసాదం అందజేశారు.

వేములవాడ రాజరాజేశ్వరస్వామిని పెద్దపల్లి ఎన్నికల వ్యయ పరిశీలకుడు ఆశిష్ యాదవ్ శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆశీర్వచనం, ఆలయ పర్యవేక్షకుడు తిరుపతిరావు ప్రసాదం అందజేశారు.

మానేరు కాలువల పూడికతీత పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న రవీందర్‌రావు

గంభీరావుపేట, జనవరి 5 : గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టు ఎడమ కాలువ పూడిక తీత పనులను శుక్రవారం నాఫ్స్‌కాబ్ ఛైర్మన్ కొండూరు రవీందర్‌రావు పరిశీలించారు. యాసంగి పంటలకు ఆయకట్టు వరకు సాగు నీరు అందించాలనే ఉద్దేశంతో సొంత ఖర్చులతో రవీందర్‌రావు పూడిక తీత పనులు చేయిస్తున్నారు. నాలుగేళ్లుగా మానేరు ఎడమ కాలువలో పేరుక పోతున్న చెత్తాచెదారం తొలగించేందుకు డబ్బులు వెచ్చిస్తున్నారు. నర్మాల సర్పంచ్ రాజు, సెస్ డైరెక్టర్ నారాయణరావు, నాయకులు సురేందర్‌రెడ్డి, రాజేందర్, కిషోర్, వెంకటి, అంజనేయులు ఉన్నారు.

సిరిసిల్ల మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌కు సన్మానం

సిరిసిల్ల టౌన్, జనవరి 5: జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్‌ను శుక్రవారం జిల్లా ప్రభుత్వ ప్రధాన వైద్యశాల ఆవరణలో జిల్లా, పట్టణ పద్మశాలీ సంఘం నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా పద్మశాలీ సంఘం ఉపాధ్యక్షుడు కొండ ప్రతాప్, సిరిసిల్ల పట్టణ ఉపాధ్యక్షుడు మోర రవి, డైరెక్టర్లు సుంచు ప్రకాష్, కట్ల సతీష్, నాయకులు భీమని రాంచంద్రం, మార్గం లక్ష్మణ్, గాజుల సదానందం, సిరిమల్లె సత్యనారాయణ, గాజుల సాగర్, ఆరకాల అనందం, సాంబారి సత్యం, ఒగ్గు గణేష్, ఉడుత రమేష్, శ్రీరాముల సదానందం పాల్గొన్నారు.

స్వయం ఉపాధి రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

గంభీరావుపేట, జనవరి 5 : నిరుద్యోగ యువత స్వయం ఉపాది రుణాలను సద్వినియోగం చేసుకోవాలని నాఫ్స్‌కాబ్ ఛైర్మన్ కొండూరు రవీందర్‌రావు అన్నారు. గంభీరావుపేట మండల కేంద్రంలో కేంద్ర సహకార బ్యాంక్ ద్వారా రూ.9 లక్షల 16 వేల చొప్పున రెండు షిఫ్ట్ డిజైర్ కార్లను లబ్ధిదారులకు శుక్రవారం అందజేశారు. గంభీరావుపేటకు చెందిన దేవేందర్, లింగన్నపేటకు చెందిన సాగర్‌కు బ్యాంక్ ద్వార షిఫ్ట్ డిజైర్ కార్లను రవీందర్‌రావు చేతుల మీదుగా తీసుకున్నారు. ఈ సందర్బంగా రవీందర్‌రావు మాట్లాడుతూ 60 శాతం సబ్సిడీపై ఫోర్ వీలర్ వాహనాలను నిరుద్యోగ యువతకు ఉపాధికోసం అందజేస్తున్నామన్నారు. బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, సీఈవో రాజిరెడ్డి, సింగిల్‌విండో మేనేజర్ సత్యంరావు ఉన్నారు.

బీఆర్ఎస్‌ను బొందపెట్టిన ప్రజలు

ఎల్లారెడ్డిపేట, జనవరి 5: బీఆర్ఎస్ పార్టీ 420గా మారితే ఎన్నికల్లో ప్రజలు బొందపెట్టారని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి ఆరోపించారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో శుక్రవారం ఆయన స్థానిక నాయకులతో కలిసి ఆ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్బంగా కేకే మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ మతిభ్రమించి కాంగ్రెస్‌ను 420 అని పేర్కొంటున్నారని, ఎవరు 420 అనేది ప్రజలు తేల్చారని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అమలు చేస్తామన్న ఆరు గ్యారెంటీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామన్నారు. గత ప్రభుత్వాలు చేసిన తప్పిదాలను పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటోందన్నారు. ఇచ్చిన ఆరు గ్యారెంటీలను వంద రోజుల్లో అమలు చేసి తీరుతోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఆయా గ్రామాలకు చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య, నాయకులు లక్ష్మారెడ్డి, గౌస్, లింగాగౌడ్, గిరిధర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బుచ్చాగౌడ్, రాజేశం, రాజేందర్, రాజునాయక్, శ్రీనివాస్‌రెడ్డి, దేవేందర్ యాదవ్, మల్లారెడ్డి, దేవయ్య, ఎల్లయ్య, కృష్ణమూర్తి, సుధాకర్ పాల్గొన్నారు.

చొప్పదండి ఎమ్మెల్యేను కలిసిన నాయకులు

ఎల్లారెడ్డిపేట, జనవరి 5: చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను కరీంనగర్‌లోని ఆయన స్వగృహంలో ఎల్లారెడ్డిపేట మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను సన్మానించారు. ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేటకు చెందిన మేడిపల్లి సత్యం చొప్పదండి ఎమ్మెల్యేగా విజయం సాధించడం తమ మండలానికే గర్వకారణమన్నారు. నాయకులు కొండూరి గాందీరావు, తిరుపతి, నర్సయ్య, లక్ష్మారెడ్డి, మల్లారెడ్డి తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో యువకుల చేరికలు

సిరిసిల్ల టౌన్, జనవరి 5: సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో జడీటీసీ పూర్మాణి మంజుల లింగారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి సమక్షంలో తంగళ్లపల్లి మండలం దేశాయిపల్లికి చెందిన యువకులు పెద్ద సంఖ్యలో పార్టీలో చేరారు. కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, తంగళ్లపల్లి మండల అధ్యక్షుడు ప్రవీణ్, నాయకులు ఎల్లప్ప, లింగారెడ్డి, శ్రీకాంత్‌గౌడ్, పర్శరాం, ఎల్లారెడ్డి, లింగారెడ్డి, శేఖర్, భాను పాల్గొన్నారు.

బలహీన వర్గాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం


దరఖాస్తు స్వీకరిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్


దరఖాస్తు స్వీకరిస్తున్న చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

వేములవాడ రూరల్/కోనరావుపేట, జనవరి 5: బలహీన వర్గాల అభివృద్ధే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. కోనరావుపేట మండలం మల్కాపేటలో శుక్రవారం ప్రజాపాలన, అభయహస్తం ఆరు గ్యారెంటీల దరఖాస్తుల సేకరణలో మాట్లాడారు. ప్రజల వద్దకే సంక్షేమ పథకాలను తీసుకొస్తున్నామన్నారు. కాంగ్రెస్ ఎన్నికల ముం దు ఇచ్చిన హామీలను కచ్చితంగా నెరవేరుస్తామన్నారు. ప్రజాపాలన 6వ తేదీ వరకు కొనసాగుతుందని, ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలవకుండా వేరువేరుగా కౌం టర్లను ఏర్పాటు చేసి దరఖాస్తులు తీసుకుంటున్నామ న్నారు. జడ్పీ ఛైర్‌పర్సన్ అరుణ రాఘవరెడ్డి, ఎంపీపీ చంద్రయ్యగౌడ్, సర్పంచ్ లత, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా, జిల్లా నాయకుడు చందనగిరి గోపాల్, కచ్చకాయల ఎల్లయ్య, బుర్ర రవీందర్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

● ప్రజా సంక్షేమఫలాలను అర్హులైన ప్రతీ ఒక్కరికి అందించడమే ప్రభుత్వ లక్ష్యమని విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. వట్టెంల గ్రామంలో శుక్రవారం ప్రజాపాలన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారెంటీలను అమలు చేసే కార్యక్రమంలో బాగంగా అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో రాంరెడ్డి, మాజీ ఎంపీపీ వట్టెంల ఎంపీటీసీ రంగు వెంకటేశం, నూకలమర్రి ఎంపీటీసీ బొడ్డు శంకరవ్వరాములు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

రుద్రంగి: రుద్రంగి మండలం వీరునితండాలోని గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం ప్రజాపాలన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి ఆరు గ్యారెంటీలను అందజేస్తామన్నారు. నిజామాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, ఎంపీడీవో శంకర్, మోహన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

బోయినపల్లి : ప్రతీ నిరుపేద కుటుంబంలో వెలుగు నింపేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని అర్హులైన ప్రతీ ఒక్కరికి ఆరు గ్యారెంటీలను అందజేస్తామని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు బోయినపల్లి మండలం గుండనపల్లి గ్రామంలో నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమానికి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలో రెండు ప్రవేశపెట్టిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. మిగతా పథకాలను ప్రతీ కుటుంబానికి అందించేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రజా పాలన కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో గౌతమ్ రెడ్డి, వేములవాడ ఆర్డీవో మధుసూదన్, తహసీల్దార్ పుష్పలత, ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, సెస్ డైరెక్టర్ కొట్టేపల్లి సుధాకర్, ఏవో ప్రణీత, సర్పంచ్ కొప్పుల లక్ష్మీస్వామి, ఎంపీటీసీ అక్కనపల్లి ఉపేందర్, ఉపసర్పంచ్‌అంజయ్య కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

చందుర్తి : ప్రజా సంక్షేమం కోసమే రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమం నిర్వహిస్తోందని జడ్పీటీసీ నాగం కుమార్ అన్నారు. మండలంలోని లింగంపేట గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రజాపాలన కార్యక్రమం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసమే రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, గృహ జ్యోతి, చేయూత, యువ వికాసం పథకాలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరిస్తోందన్నారు. ఎంపీడీవో రవీందర్, మండల వ్యవసాయ అధికారి దుర్గరాజు, సర్పంచ్ దప్పుల లక్ష్మీ, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ దప్పుల అశోక్, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట : అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందించాలనే ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమం ఏర్పాటు చేసిందని ఎంపీపీ వుట్కూరి వెంకటరమణారెడ్డి అన్నారు. మండలంలోని వల్లంపట్ల, అనంతారం, కిష్టరావుపల్లె, ఒగులాపూర్ గ్రామాలలో శుక్రవారం ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించారు. మండలాన్ని అన్నిరంగాలలో అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పని చేస్తున్నారన్నారు. సర్పంచులు కేతిరెడ్డి అనసూయనర్సింహరెడ్డి, ముస్కు మల్లయ్య, మల్లవ్వ, చల్ల నారాయణ, ఎంపీటీసీలు నాయిని స్రవంతి, తీగల పుష్పలత, ముత్యంరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భూంపెల్లి రాఘవరెడ్డి, నియోజకవర్గ అధికారప్రతినిధి వెంకటి పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: తెలంగాణలో ప్రజలు మార్పు కోరుకుని కాంగ్రెస్‌కు పట్టం కట్టారని, సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజక వర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం అగ్రహారంలో ప్రజా పాలన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. సర్పంచ్ అమృత, ఎంపీవో వజీర్‌అహ్మద్, ఎంపీటీసీ తిరుపతి బాబు, నాయకులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: ప్రజాపాలన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ముస్తాబాద్ ఎంపీడీవో రమాదేవి పేర్కొన్నారు. మండలంలోని సేవాలాలతండా, రాంరెడ్డిపల్లె గ్రామాల్లో శుక్రవారం ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లను పరిశీలించారు. తహసీల్దార్ గణేశ్, సర్పంచ్ శ్రీనివాస్, పోచయ్య పాల్గొన్నారు.

కార్యాలయానికి తాళం

● మండలంలోని ఆవునూర్‌లో ఆరు గ్యారెంటీల కోసం దరఖాస్తు ఫారాన్ని ఇవ్వడానికి వెళ్తే మధ్యాహ్నం సమయంలో పంచాయతీకి తాళం వేసుకొని వెళ్లిపోయరని గ్రామస్థుడు బత్తుల నవీన్ ఆరోపించాడు. తాళం వసేటప్పుడు గ్రామ పంచాయతీ సిబ్బందిని ప్రశ్నిస్తున్నా పని ఉందంటూ వెళ్లిపోయారన్నారు.

గంభీరావుపేట: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కొండూరు గాంధీ అన్నారు. గంభీరావుపేట మండలం ముచ్చర్లలో శుక్రవారం ప్రజా పాలన గ్రామ సభను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ వంద రోజుల వ్యవధిలో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామన్నారు. ఇప్పటికే మహిళలకు ఉచిత బస్ ప్రయాణం ప్రారంభించినట్లు చెప్పారు.

మానాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం


గజమాలతో సన్మానిస్తున్న నాయకులు

రుద్రంగి, జనవరి 5: రుద్రంగితోపాటు మానాల గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. రుద్రంగి మండలం మానాలలో శుక్రవారం కృతజ్ఞత ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన విజయానికి కృషి చేసిన వేములవాడ, రుద్రంగి మండల ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గం పరిధి వేరే అయినా మానాల గ్రామంతో తనకు విడదీయరాని అనుబంధం ఉందన్నారు. ప్రజాపాలనతో గ్రామాల్లోనే ప్రజా సమస్యలను పరిష్కరించనున్నట్లు చెప్పారు. మానాల ప్రజలకు ఎలాంటి సమస్య వచ్చినా తన దృష్టి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. మానాల - మరిమడ్ల రోడ్డు పనులు అటవీ శాఖ అనుమతులు లేకపోవడంతో నిలిచిపోయాయని, అధికారులతో మాట్లాడి పది రోజుల్లో పనులు ప్రారంభిస్తామని అన్నారు. అనంతరం గ్రామంలోని శంభులింగేశ్వర స్వామి ఆలయం, బడి తండాలోని సేవాలాల్ మహరాజ్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు కాంగ్రెస్ నాయకులు, ప్రజలు ఆది శ్రీనివాస్‌ను గజమాలతో సన్మానించారు. కార్యక్రమంలో నిజామాబాద్ డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, సర్పంచ్ మానస, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జలపతి, ఉపాధ్యక్షుడు మనోహర్, గ్రామ అధ్యక్షుడు సామ మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్ల ప్రారంభం

తంగళ్లపల్లి, జనవరి 5: కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ నిధుల నుంచి తంగళ్లపల్లి మండల కేంద్రంలో లక్ష్మీనర్సింహ స్వామి దేవాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ఎంపీపీ పడిగెల మానస రాజు శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ అంకారపు అనిత రవీందర్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ పుసపెల్లి సరస్వతి, కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు వైద్య శివప్రసాద్, అంకారపు రవీందర్, ఎగుమామిడి వెంకటరమణరెడ్డి, పడిగెల రాజు, క్యారం జగత్, గజభీంకర్ సంతోష్, కందుకూరి రామగౌడ్, అంకారపు మహేశ్, ఆసాని లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అదనపు బస్సులు వేయాలి

సిరిసిల్ల టౌన్, జనవరి 5: ప్రతీరోజు ఉదయం, సాయంత్రం సమయంలో విద్యార్థుల సౌకర్యార్థం అదనపు బస్సులు నడపాలని కోరుతూ శుక్రవారం బీఆర్ఎస్వీ నాయకులు సిరిసిల్ల డిపో మేనేజర్ మనోహర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ మాట్లాడుతూ ప్రతిరోజు ఉదయం, సాయంత్రం సమయంలో విద్యార్థులు గ్రామాల నుంచి జిల్లా కేంద్రంలోని కళాశాలలు, పాఠశాలలకు రావడానికి, పోవడానికి బస్సులు వేయక పోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. బీఆర్ఎస్వీ నాయకులు మట్టె శ్రీనివాస్, నవీన్, జగన్, భాను, నరేష్, తిరుపతి, రాకేష్, సంపత్, కార్తిక్, ఆశీర్వాద్, రాహుల్ పాల్గొన్నారు.

హద్దులు నిర్ణయించాలి

ఎల్లారెడ్డిపేట, జనవరి 5: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని డబుల్ బెడ్ రూం ఇళ్ల సమీపంలో ఉన్న తిమ్మాసుకుంటకు హద్దులు నిర్ణయించాలని కోరుతూ మాజీ ఎంపీటీసీ బాలరాజుయాదవ్ శుక్రవారం తహసీల్దార్ రాంచందర్‌కు వినతి పత్రం అందజేశారు. కొందరు రైతులు కుంటను ఆక్రమించుకుంటున్నారని పేర్కొన్నారు. హద్దులు నిర్ణయించి కబ్జాకు గురి కాకుండా చూడాలని బాలరాజుయాదవ్ కోరారు.

విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీని కలిసిన ప్రిన్సిపాల్

వేములవాడ టౌన్, జనవరి 5: వేములవాడ మండలంలోని అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ హైదరాబాద్‌లో విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్ర వెంకటేశంను శుక్రవారం కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట అధ్యాపకుడు వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

రెడ్డి సంఘం అధ్యక్షుడిగా లక్ష్మారెడ్డి

చందుర్తి, జనవరి 5: చందుర్తి మండలం బండపల్లి గ్రామ రెడ్డి సంఘం నూతన కార్యవర్గాన్ని సంఘం సభ్యులు శుక్రవారం ఎన్నుకున్నారు. సంఘం గ్రామ అధ్యక్షుడిగా గడ్డం లక్ష్మారెడ్డి, ఉపాధ్యక్షుడుగా ముస్కు మల్లారెడ్డి, క్యాషియర్‌గా గడ్డం దామోదర్ రెడ్డి ఎన్నికయ్యారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వీర్నపల్లి, జనవరి 5: వీర్నపల్లి 33 కేవీ ఫీడర్ మరమ్మతు కారణంగా అడవిపదిర, వీర్నపల్లి, కంచర్ల సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలకు శనివారం ఉదయం 9 గంటల నుంచి 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెస్ అధికారులు తెలిపారు. విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం


సమావేశంలో మాట్లాడుతున్న కేకే మహేందర్‌రెడ్డి

సిరిసిల్ల టౌన్, జనవరి 5: ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని, బతుకమ్మ చీరలతో సిరిసిల్లకు కొంత చెడ్డ పేరు వచ్చిందని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పద్మశాలీ కల్యాణ భవనంలో సిరిసిల్ల పద్మశాలీ సంఘం అధ్యక్షుడు గోలి వెంకటరమణ అధ్యక్షతన పవర్ లూం వస్త్ర పరిశ్రమలోని సమ స్యలు - పరిష్కార మార్గాలపై పరిశ్రమ - ప్రతి నిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుకు ఏ విధంగా సబ్సిడీ ఇస్తున్నారో ఆ విధంగా నేతన్నకు కూడా ఇవ్వాలని ఇక్కడ పెద్దలు అడిగారన్నారు. నేతన్నలకు సబ్సిడీ ప్రవేశపెట్టింది గతంలో కాంగ్రెస్సే అన్నారు. వస్త్ర పరిశ్రమ పెద్దలు సబ్సిడీపై లిఖిత పూర్వకంగా ఇస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. సమస్యపై సమ్మె చేస్తామని కొందరు పెద్దలు సమావేశంలో చెప్పారని, సమ్మె దేనికీ పరిష్కారం కాదని అన్నారు. తెలంగాణలో ప్రభుత్వం అధికారంలోకి వచ్చి కేవలం 30 రోజులు మాత్రమే అయ్యిందని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితులతో ఆలస్యం అవుతోందని అన్నారు. పాఠశాలల విద్యార్థుల యూనిఫాంకు సంబంధించిన బట్ట కావల్సి ఉన్నందున్న ఆర్వీఎం క్లాత్ ఉత్పత్తులపై ప్రభుత్వం ఒక అడుగు ముందుకు వేసిందన్నారు. అగ్గిపెట్టలో ఇమిడే చీరను నేసి దేశంలో సిరిసిల్ల పేరును వినిపించిన నేతన్న నల్ల పరంధాములని చెప్పక తప్పదన్నారు. బతకమ్మ చీరలు రాగానే వాటిని చూసి తనకు సిగ్గు అనిపించిందన్నారు. సిరిసిల్లలో బతుకమ్మ చీరలతో మాత్రం కొంత చెడ్డ పేరు వచ్చిందని, పాలిస్టర్ పరిశ్రమతోపాటు నేతన్న పరిశ్రమను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని అన్నారు. ప్రభుత్వాల పాలసీలు అలా ఉండడం వల్లే వస్త్ర వ్యాపారులు బతుకమ్మ చీరలను ఆవిధంగా ఉత్పత్తి చేశారని, తాను వ్యాపారులను తప్పు పట్టడం లేదని అన్నారు. జనవరి లేదా ఫిబ్రవరిలో బతుకమ్మ చీరల బిల్లులను ఇచ్చే విధంగా బాధ్యత తీసుకుంటానన్నారు. పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు బాలయ్య పట్టణ మహిళా సంఘం అధ్యక్షురాలు వనిత నళినీకాంత్, పాలిస్టర్ వస్త్ర ఉత్పత్తుదారుల సంఘం అధ్యక్షుడు సత్యం, చేనేత వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షుడు దామోదర్, యారన్ అసోసియేషన్ అధ్యక్షుడు మధు, డైయింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజేశం, సైజింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేష్, ఆసాముల సంఘాల అధ్యక్షులు రవీందర్, అశోక్, కాటన్ సంఘం అధ్యక్షుడు లక్ష్మినారాయణ, మాక్స్ సంఘాల అధ్యక్షుడు శంకర్, సీపీఐ జిల్లా కార్యదర్శి మూషం రమేష్, సీపీఐ పట్టణ కార్యదర్శి రవి, మాజీ మున్సిపల్ ఛైర్మన్ రవీందర్, మాజీ కౌన్సిలర్ చంద్రకళాప్రభాకర్ పాల్గొన్నారు.

జిల్లాలో నీటి సంరక్షణ చర్యలు భేష్


కేంద్ర బృందంతో కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జలశక్తి అభియాన్ కింద చేపట్టిన నీటి సంరక్షణ చర్యలు బాగున్నాయని జలశక్తి అభియాన్ కేంద్ర నోడల్ అధికారి గణేష్ భన్వర్‌లాల్ బృందం సభ్యులు లక్ష్మీనారాయణ, దామోదర్ ప్రశంసించారు. శుక్రవారం సాయంత్రం సిరిసిల్లలోని పంచాయతీరాజ్ గెస్ట్‌హౌస్‌లో కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్ గౌతమి, ఇతర అధికారులు కలిశారు. కేంద్ర బృందం రెండు రోజులపాటు జిల్లాలో పర్యటించింది. ఈ సందర్భంగా జిల్లాలో చేపట్టిన నీటి సంరక్షణ పనులు చాలా బాగున్నాయని భూగర్భ జలాల మట్టం గణనీయంగా పెరిగిందని సభ్యులు అభిప్రాయం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో ఇలాంటివి కొనసాగేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో శ్రీనివాస్, అదనపు డీఆర్‌డీవో మదన్‌మోహన్, ప్యాకేజీ 9 ఈఈ శ్రీనివాసరెడ్డి, ఉద్యానవన శాఖ అధికారి జ్యోతి, మిషన్‌భగీరథ ఇంట్రా ఈఈ జానకి, మున్సిపల్ కమీషనర్ అలీబేగ్, ఎఫ్ఆర్వో శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

● ఇల్లంతకుంట: మండలంలోని రేపాక, సోమారంపేట, గొల్లపల్లి, అనంతగిరిలో శనివారం నిర్వహించనున్న ప్రజాపాలనకు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ హాజరవుతారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూంపెల్లి రాఘవరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

● ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీలపై మండలంలోని అనంతారం, కిష్టారావుపల్లెలో శనివారం సాంస్కృతిక సారధులు శనివారం కళాజాతా నిర్వహించారు.

● వేములవాడ రూరల్: మండలంలోని ఎదురుగట్లలో పేద కుటుంబానికి చెందిన రాచర్ల శ్వేత వివాహ ఖర్చులకు ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ రూ.5వేలు ఆర్థిక సాయాన్ని శుక్రవారం అందజేశారు. స్థానిక సర్పంచ్ సోయినేని కరుణాకర్, పార్టీ మండల అధ్యక్షుడు వకులాభరణం శ్రీనివాస్, ఎంపీటీసీ రంగు వెంకటేశం, నాయకులు సంపేట గంగరాజు, సోయినేని రాజు, శేఖర్, శ్రీనివాస్, చందు, రవి, లచ్చిరెడ్డి, రమేస్ పాల్గొన్నారు.

ఇంటింటికీ అయోధ్య రాముడి అక్షింతలు


ముస్తాబాద్‌లో అక్షింతలతో దేవేందర్, భక్తులు


బాపుసాయి పేటలో

ముస్తాబాద్, జనవరి 5 : ముస్తాబాద్ మండల కేంద్రంలో ఇంటింటికీ అయోధ్య రాముడి అక్షింతలను శుక్రవారం అందించారు. రామభక్తుడు గూడెపు దేవేందర్ ఆధ్వర్యంలో పలువురు మహిళలు, గ్రామస్థులు శివకేశవుల ఆలయం వద్ద అక్షింతలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో అక్షింతలతో శోభాయాత్ర చేపట్టారు. సర్పంచ్ సుమతి, గూడెపు దేవేందర్, గూడెపు లావణ్య, పద్మ, లక్ష్మీ మెర్గు అంజాగౌడ్, కొండాపూర్ రాజు సెట్, గందె రమేశ్, వెంకటేశ్, మల్లారపు సంతోష్‌రెడ్డి, ఒరగంటి సత్యం, దీటి సత్యం, వప్పుల శ్రీకాంత్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: అయోధ్య నుంచి వచ్చిన రాముచిట అక్షింతలను ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలో అయోధ్య రామ మందిర తీర్థ ట్రస్టు ఆధ్వర్యంలోని సభ్యులు శుక్రవారం ఇంటి ఇంటికి అందజేశారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికి అక్షింతలను స్వీకరించారు. ట్రస్టు సభ్యులు, స్థానికులు, మహిళలు పాల్గొన్నారు.

కోనరావుపేట: కోనరావుపేట మండలంలోని బావుసాయి పేట, మామిడిపల్లి, మంగళపల్లి గ్రామాల్లో శుక్రవారం భక్తి శ్రద్ధలతో అయోధ్య రామ మందిర్ అక్షింతల శోభాయాత్ర నిర్వహించారు. ముందుగా గ్రామంలోని లక్ష్మీ సమేత వేంకటేశ్వర స్వామి, హనుమాన్ ఆలయాల్లో అక్షింతలకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో హనుమాన్ ఉత్సవ కమిటీ సభ్యులు, సర్పంచులు కెంద గంగాధర్, వెలిచాల సంతోష్, కొక్కుల భారతి తదితరులు పాల్గొన్నారు.


బ్యాటింగ్ చేస్తున్న ఎస్పీ

ఉత్సాహంగా ఫ్రెండ్లీ క్రికెట్ టోర్నీ




విజేత, రన్నరప్ జట్లకు ట్రోఫీలు అందజేస్తున్న ఎస్పీ

సిరిసిల్ల టౌన్, జనవరి 5: పోలీసులు, ఎలక్ట్రానిక్ అండ్ ప్రింట్ మీడియా పాత్రికేయుల మధ్య సాగిన ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ టోర్నీ ఉత్సాహంగా సాగింది. శుక్రవారం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో జిల్లా పోలీస్ శాఖ, సిరిసిల్ల ప్రెస్‌క్లబ్ మధ్య నిర్ణీత 12 ఓవర్ల మ్యాచ్‌ను ఎస్పీ నిఖిల్ మహాజన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం పెంపొందుతుందన్నారు. జర్నలిస్టులు, పోలీసుల మధ్య కో ఆర్డినేషన్ ఉండడానికే ఈ ఫ్రెండ్లీ మ్యాచ్‌ను నిర్వహించినట్లు చెప్పారు. ఇలాంటి పోటీలు టీమ్ స్పిరిట్‌ను ఇస్తాయన్నారు. అనంతరం జిల్లా పోలీస్‌శాఖ, సిరిసిల్ల ప్రెస్‌క్లబ్ జట్ల మధ్య జరిగిన నిర్ణీత 12 ఓవర్ల మ్యాచ్ హోరాహోరీగా సాగింది. మొదట బ్యాటింగ్ చేసి సిరిసిల్ల ప్రెస్‌క్లబ్ జట్టు 83 పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. అనంతరం బ్యాటింగ్ చేసిన జిల్లా పోలీస్ శాఖ జట్టు 11 ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి 84 పరుగులు చేసి 4 వికెట్లతో విజయం సాధించింది. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ నిఖిల్ మహాజన్, అదనపు ఎస్పీ చంద్రయ్య జిల్లా పోలీస్ శాఖ విజేత జట్టుకు, రన్నరప్ సిరిసిల్ల ప్రెస్‌క్లబ్ జట్టుకు బహుమతులు అందజేశారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా గొట్టె కిరణ్(ప్రెస్‌క్లబ్), రాజు(ప్రెస్‌క్లబ్)కు అందించారు. కార్యక్రమంలో సిరిసిల్ల, వేములవాడ డీఎస్పీలు ఉదయ్‌రెడ్డి, నాగేంద్రచారి, ఆర్ఐలు, సిరిసిల్ల, వేములవాడ పట్టణ, రూరల్ సీఐలు, ఎస్ఐలు, సిరిసిల్ల ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ఆకుల జయంతికుమార్, ప్రధాన కార్యదర్శి పర్కాల ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యక్షుడు రఘు, సహాయ కార్యదర్శి రాపెల్లి భాస్కర్, కోశాధికారి కాయితి మహేందర్, సీనియర్ పాత్రికేయులు టీవీ నారాయణ, ఊరడి మల్లికార్జున్, కరణాల భద్రాచలం, చింతికింది శ్యాం, పాలమాకుల శేఖర్, కాయితి బాలు తదితరులు పాల్గొన్నారు.